# గుండె కరగదు

## ముంగర శంకరరాజు (1924-2001)

**హిందీ**, తెలుగు భాషణలలో ప్రావీణం వున్న శంకరరాజు మద్రాసు దక్షిణ భారత హిందీ ప్రచార సభలో రచయితగా పనిచేశారు. 1940లలోనే చిత్రగుప్తలో వీరి కథలు తరచుగా వస్తుండేవి. "రహీమ్ కూతురు" కథల సంపుటి, "విపథగామి" నవల వెలువడ్డాయి. కవులు చెప్పిన కథలు, అక్కా యీ కథ వినిపో, రాజహంస చెప్పిన రమణీయ గాథలు - వీటిని శీర్షికలుగా వివిధ పత్రికలలో నిర్వహించారు. రాయచోటి తాలూతతతతకా సంబేపల్లె వీరి స్వస్థలం. యీ కథ 1989లో ప్రచురితమైంది. పుట్టిన నేల పదజాలం, చెన్నపట్నపు జీవితం వీరి కథలలో అందంగా కలిసి కనిపిస్తాయి.

**ఇం**టి ముందు వరండా.

వరండాలో నవారు మంచం.

మంచం మీద నా పడక.

నాకు తోడు ఉబ్బసం.

రొమ్ములో కఫం గడ్డకట్టి, శ్వాస ఆడక మెలుకువ వచ్చి, తెల్లవారుజామున నాలుగ్గంటలకే మంచం మీద లేచి కూచున్నా.

రొమ్ములో తేమ ఆరిపోయి, గళ్ళ తెగక ఊపిరి బైటికి రావడానికి గుర్రుగుర్రంటూ గొంతులో గింజు కుంటోంది. తెరలు తెరలుగా వస్తున్న దగ్గుతో హోరా హోరీ పోరాడుతున్నా. ఈ చలికాలంలో ప్రతి రాత్రీ తెల్లవారుజామున లేస్తూనే ఇదే కసరత్తు.

గంట నుంచి విడవకుండా దగ్గీ, దగ్గీ గొంతూ రొమ్మూ పుండులా నొప్పి పెడుతున్నాయి. అంత చలి వేళలో కూడా మెడ కింద చెమట పట్టింది. మంచం కింద కాళ్ళ దగ్గర మట్టి నింపిన సత్తుచేట గళ్ళతో నిండిపోయింది.

ఆయాసం- అలసట - నిస్త్రాణ. పక్కన మందు సీసా. దిండు కింద అమృతాంజనం డబ్బీ ఉన్నాయి. అయినా వంగి తీసుకునే ఓపిక గూడా లేదు.

అయిదు కావచ్చింది.

చుట్టూ ముసురుకున్న మంచు చీకట్లు. పార్కులో మసక మసగ్గా కనబడుతున్న చెట్లు. చెళ్ళున చెంపలు వాయిస్తున్న చలిగాలి. దగ్గు దెబ్బకు తల దిమ్మెక్కి కణ తల్లో పోటు. ఉన్ని శాలువ చెంపలకూ, మెడకూ గట్టిగా చుట్టుకున్నా అపుడపుడూ అరాకొరా పక్షుల రెక్కల చప్పుడు వింటూ కళ్ళు మూసుకొని కూచున్నా.

నాకు దగ్గు, దగ్గుకు నేను. ఒకరికొకరు తోడు. మాది ఏకాంతవాసం. ఆవేళపుడు మమ్మల్ని ఎవరూ పలకరించరు, పట్టించుకోరు.

కానీ ఓ పలకరింపు.

"కొంచెం కాఫీ తాగండి, వేడివేడిగా తెచ్చాను."

గొంతు గుర్తించా. పక్కింటి జగదాంబ.

కళ్ళు తెరిచి చూశా. కాఫీ గ్లాసు చేతబట్టుకొని ఆమె నా మంచం ఎదుట నిలబడి వుంది.

కొంత జంకు, కొంత సిగ్గు, కొంత న్యూనతా భావం. కొంత తటపటాయింపు.

## ఆణిముత్యాలు

"ఇంత వేకువలో ఎందుకండీ శ్రమ తీసుకు న్నారు?"

"శ్రమ ఏముందండీ, మాకు మామూలే. రోజూ ఈ వేళకు కాఫీ పెట్టుకుంటాము" అంటూ గ్లాసు చేతి కందించింది.

తీసుకున్నాను.

"ఆయాసంతో ఉన్నారు. నెమ్మదిగా తాగండి. తెల్లవారుతూనే వచ్చి గ్లాసు తీసుకెళతాను" ఆమె వెళ్ళి పోయింది.

కాఫీ తాగాను. వేడివేడిగా గొంతులో దిగింది. ఆయాసం తగ్గింది. మనసు కొంచెం నెమ్మదించింది.

ఆమె ఓ అశ్వినీ దేవత. ఆ కాఫీ ఓ దివ్యౌషధంలా తోచింది నాకప్పుడు. హాయిగా ఊపిరి పీల్చుకొని సిగరెట్టు ముట్టించుకున్నాను.

పార్వతి గుర్తుకొచ్చింది. తెల్లవారక ముందే కాఫీ తాగే అలవాటు పార్వతి నేర్పింది. అంతకు ముందు నాకు ఈ బెడ్ కాఫీ అలవాటు లేదు. మా తొలికాపురం బ్రాహ్మణ వీధిలో పెట్టాము. అయిదు గంటలకే ఇంటికి పాలు వచ్చేవి. వెంటనే కాఫీ పెట్టి వేడివేడిగా నా పక్కన ఉంచేది.

నీళ్ళు పుక్కిలించి, కాఫీ తాగి, సిగరెట్టు ముట్టించి, యోగిలా కూచొని, భోగానుభూతి పొందేవాణ్ణి. అప్పటి నుంచి అయిదు గంటలకు బెడ్ కాఫీ కోసం ప్రాణం కొటకొటలాడుతుంది.

ఉబ్బసం దాపురించిన తరువాత ఉదుకుదుకు కాఫీ మరీ తెల్లవారుజామున అనివార్యమైంది. అయినా ఇప్పుడు పార్వతి లేదు. కాఫీ తాగే ఆ యోగమూ లేదు.

ఇప్పుడు మా ఇంటి తలుపులు ఆరుగంటల పిమ్మటే ఆవలిస్తూ తెరుచుకుంటాయి. ఆ తరువాతే కాఫీ ప్రాప్తి.

○ ○ ○

ఆరు గంటల పిమ్మట తలుపు తెరచుకొని బయటికి వచ్చిన మా కోడలు నా మంచం కింద ఖాళీ కాఫీ గ్లాసు చూడ్డం - ఆశ్చర్యపోవడం - ఆరా తియ్యడం - దాని మీద కొడుకూ, కోడలూ చిన్నగా గొడవ పడటం జరిగాయి.

"పొద్దున్నే లేచి నాన్నకు ఓ గ్లాసు కాఫీ పెట్టివ్వ కూడదా?" అని కుమారుడు కోడల్ని దండిస్తున్నాడు.

అప్పుడే గ్లాసు కోసం వచ్చిన జగదాంబ కల్పించుకొని "ఆమె చంటిబిడ్డ తల్లి. రాత్రుల్లో పలుమార్లు మేలుకోవలసి ఉంటుంది. అయిదు గంటలకే లేవాలంటే కొంచెం ఇబ్బందే. నేనెట్లాగూ అయిదుకు లేచి కాఫీ పెట్టుకుంటాను. దూరమా, భారమా? పక్కనే గదా ఉంటాను. ఓ కప్పు కాఫీ తెచ్చి పెద్దాయనకు ఇస్తుంటాను. ఇందులో పుట్టి మునిగేదేముంది?" అని వాళ్ళకు సర్దిచెప్పింది సౌమ్యంగా.

జగదాంబ పట్ల మా ఇంట్లో వాళ్ళకు గురీ - గౌరవం ఉన్నాయి. ఆనాటి నుంచి రోజూ తెల్లవారుజామున జగదాంబే నాకు కాఫీ తెచ్చి ఇస్తూంటుంది లేదా పనిపిల్ల చేత పంపిస్తూంటుంది.

మేముండేది గవర్నమెంటు క్వార్టర్సులో. క్వార్టర్స్ ఊరికి కొంచెం ఎడంగా ఉన్నాయి. ఇళ్ళకు ఎదురుగా చిన్న అడవిలాంటి విశాలమైన ప్రదేశం. అక్కడక్కడా చిన్నచిన్న గుట్టలు. వాటి చుట్టూ వలయాలుగా తారు రోడ్లు. వీటినే రౌండు రోడ్లంటారు. రోడ్ల పక్కల్లో - గుట్టల మీదా - అటవీ శాఖ వారు పెంచిన అపురూపమైన, అతి విలువైన రక్తచందనం వనాలు. ఎప్పుడూ పచ్చపచ్చగా, చల్లగా, ప్రశాంతంగా ఉంటాయి ఆ పరిసరాలు.

ఒకే కాంపౌండులో ఒకే బ్లాకులో రెండు పోర్షన్లు. ఒక వాటాలో మేము. మరో వాటాలో జగదాంబ వాళ్ళుంటారు. జగదాంబ అల్లుడు జియాలజిస్టు. పేరు విశ్వనాథం. కూతురు దుర్గాంబ బి.ఇడి. చేసిందంట. ఊరికే ఉండడం ఎందుకని ఏదో కాన్వెంటులో టీచరుగా పనిచేస్తోంది. వారికి నాలుగేళ్ళ కూతురు ప్రసన్న. జగదాంబ అల్లుడూ, కూతుళ్ళతోనే ఉంటోంది. వాళ్ళు బదిలీ మీద ఆ ఊరొచ్చి రెండు నెలలే అయింది.

పక్కింటి వాళ్ళతో నాకు పెద్దగా పరిచయం లేదు.

## యుగాది

అనాది కాలం నుంచి నవయుగానికి
నాంది పలుకుతూ
మళ్ళీ వచ్చింది యుగాది
మావిచిగురు తిని సంబరంతో
పాడుతున్న కోయిల మధురధ్వనిలో
మళ్ళీ వచ్చింది యుగాది
వేప-మామిడి ఫలభారంతో
ఉయ్యాలలూగుతున్న రెమ్మలో
మళ్ళీ వచ్చింది యుగాది
రాజవీధి ఇరుపక్కలా అంబరానికి
పందిరివేసి ఋతురాజుకి
స్వాగతం పలుకుతున్న పూలచెట్లలో
మళ్ళీ వచ్చింది యుగాది
ప్రకృతిదేవి తన దుకూలాల్ని
విప్పిపెట్టిన ప్రఫుల్ల పరిసరంలో
మళ్ళీ వచ్చింది యుగాది
వసంత పుష్పాల నుంచి తేలివస్తున్న
తుమ్మెద గానంలో
మళ్ళీ వచ్చింది యుగాది
పచ్చళ్ళలో తీపి-చేదుని సమంగా కలిపి
మనిషి-మనిషి మధ్య భద్రపునాది వేసేందుకు
మళ్ళీ వచ్చింది హిందూ సంవత్సరాది
చంద్రమాన యుగాది.

-సోమ సురేష్

నా ఏకాకి బతుకు నాది. జగదాంబ తరచూ మా ఇంటికి వస్తూంటుంది. ఊరగాయలు, పచ్చళ్ళు, కొత్త వంటలు చెయ్యడంలో మా కోడళ్ళకి సహాయపడుతూం టుంది. మంచి కలుపుగోలు మనిషి. ఎప్పుడూ ప్రసన్నంగా నవ్వుతూ ఉంటుంది.

ముసలితనం మీదపడుతూనే లోకంతో, సమాజంతో, మనుషులతో నాకున్న వ్యాపకాలు, వ్యాసంగాలు అన్నీ ఒక్కోటిగా తెగిపోయాయి. నా ప్రపంచం కుంచించుకుంటూ వచ్చి ఇప్పుడీ వరండాకు పరిమితమైపోయింది. చుట్టూ అందరూ ఉండి కూడా ఒంటరి వాణ్ణి. వార్ధక్యం నన్ను వేరుపడ్డ దీవి గడ్డ లాంటివాణ్ణి చేసింది.

పగళ్ళు భారంగా గడిచిపోతాయి. రాత్రుళ్ళు దిగులు దిగులుగా దాపురిస్తాయి. మా వాళ్ళు సినిమాల కెళ్ళొచ్చి, భోజనాలు చేసి రేడియోలో క్రికెట్ కామెంటరీ విని, కబుర్లాడి, తలుపులు బిడాయించి, దీపాలార్పేసి, లోపల పడుకుంటారు. ఇక్కడ వరండాలో మంచం మీద నేనూ - నా ఏకాంత వాసం. ఓ పలకరింపు లేదు, ఓ పరామర్శ లేదు.

పని లేదు. పొద్దుపోదు. నిద్ర పట్టదు. పట్టినా వెంటనే మెలకువ వస్తుంది. లేచి కూచుంటాను. అలాంటి నిశి నిశ్శబ్ద వేళల్లో అడవి దోమల్లా ఆలోచనలు నన్ను ముసురుకుంటాయి. గతాలు గుర్తుకు వస్తాయి...

కొడుకులు, కూతుళ్ళు, అల్లుళ్ళు అందరూ ప్రయోజకులైనారు. స్వయం పోషకులైనారు. ఇప్పుడు వారికి నా అవసరం లేదు. అక్కరలేదు. కనీసం నా అనుభవాలు, సలహాలు కూడా వారికి పనికిరావు. అసలు రుచించవు కూడా. కూరకు వాడుకొని పారవేసిన కరివేపాకును నేను. మర్యాదగా ఓ మూలకు నెట్టేశారు. ఇంట్లో పడిన చెత్తాచెదారం అప్పటికప్పుడు మూలకు తోసిపెడుతుంటారు. పిమ్మట ఓమారుగా ఆ చెత్తను చేటకెత్తి ఇంటి బైట పెంట కుప్పలో పారేసి వస్తారు. ఇప్పుడు నాదీ అలాంటి చెత్త బతుకే. పారేయడమే తరువాయి.

ఒకవేళ దైనందిన సంసార విషయాల్లో జోక్యం తీసుకోబోతే "ఇంకా మీకెందుకా తాపత్రయం? ఓ మూల కూచొని పుస్తకం చదువుకోండి. లేదా కళ్ళు మూసుకొని రామా కృష్ణా అంటూ జపం చేసుకోండి" అంటారు. ఉరిశిక్ష అమలు జరిపే ముందు ఖైదీని - ఒకమారు దేవుణ్ణి ప్రార్థించుకో- అని జైలు అధికారులు చెబుతారే! అలా అనిపిస్తుంది నాకు మా వారి మాటలు.

బతుక్కూ చావుకూ మధ్య ఊగిసలాడే ఈ సజీవ కంకాళంతో ఇప్పుడు ఎవరికేం పని! ఉపేక్షకూ, ఉదాసీనతకూ గురి అయిన వ్యర్థ జీవనం!

నా స్థితికి నేను జాలిపడడం తప్ప అసలుకు ఆలోచిస్తే ఎవర్నీ ఏమీ అనలేను. నాకు సేవలు చేయలేదని దూషించలేను. అందరికీ ఉద్యోగాలు. అందరికీ చిన్న బిడ్డలు. ఊపిరి ఆడని గంటలు. తీరికలేని దినాలు. ఎప్పుడూ బిజీ బతుకులు. ఉరుకులూ పరుగులుగా ఉండే నేటి పట్నవాసం బతుకుల్లో ముసలకీ, ముతక్కీ సేవలు చేసుకుంటూ ఉండే వ్యవధి వారికి ఎక్కడుంది? ఎవర్ని నిందించి ఏం లాభం? మధ్య తరగతి బతుకులే ఇలా తగలడ్డాయి.

ఇలా సాగుతుంది నా అంతర్మథనం. ఆలోచిస్తూ ఏ అర్థరాత్రికో నిద్రలోకి జారుకుంటాను.

## కాలం తెరతీస్తే...!

కథనమే కొత్తది / కథ పాతదే
భూమిక నియంతృత్వం
ఏ ముసుగులో ఉన్నా
నియంతృత్వం స్వాతంత్ర్యం కాదు
వేషమేదైనా స్వభావం అణచివేతే
భావం బానిసత్వమే
విచిత్ర మేమంటే
నాయక పాత్రలన్నీ నియంతలవి
ఒకడు స్వదేశీ, మరొకడు పరదేశీ
నియంతృత్వం కాల్పనికతే
కాలం తెరతీస్తే / నియంతలంతా పరాజితులే
ప్రతి నియంతా వల్లించేది
గొర్రె - తోడేలు నీటికథే
నియంత దేశభక్తుడైనా
ప్రజలు బానిసలే
వారి ప్రాణాలే పాలనా సమిధలు
ముగింపులో ఎన్ని మలుపులున్నా
విజయం స్వేచ్ఛా విహంగానిదే
నియంతృత్వానికి ఉరివేసే
ఉషోదయం కోసం ఎదురు చూద్దాం
నియంతల అంతిమ ఘడియల కోసం
శుభ ఘడియలు లెక్కిద్దాం!

-వై. హెచ్. కె. మోహన్‌రావు

○ ○ ○

ఆ రోజు తెల్లవారక ముందే యథాప్రకారం లేచి కూచున్నా. జగదాంబ శొంఠి, మిరియాలతో చేసిన కషాయం పసిపిల్ల చేత పంపించింది. ఘాటుగా వేడి వేడిగా ఉన్న కషాయం నా గొంతుకెంతో హాయి నిచ్చింది. దేవుడు పంపిన దేవత జగదాంబ. అవ్యాజ మైన ఆదరణ. ఎండునేలకు తొలకరి చినుకుల్లాంటి చల్లని పరామర్శ. కళ్ళు మూసుకొని మనసులో కృతజ్ఞ తలు చెప్పుకుంటున్నా.

కాళ్ళ దగ్గర చప్పుడైతే కళ్ళు తెరిచి చూశా. రాహు లుడు. వాడు మంచం కింద మట్టి చేట తన ముందుకు లాక్కుని "ఖక్... ఖక్..." అని దగ్గుతూ "థూ... థూ" అని చేటలోకి ఉత్తుత్తిగా ఉమ్మేస్తున్నాడు. చిలిపి వెధవ. వేలెడంత లేడు. తాతకు దగ్గు నేర్పిస్తున్నాడు. వాడి చేష్టకు నవ్వొచ్చింది. పైకెత్తి ఒళ్ళో కూచోబెట్టుకుని తల ముద్దాడాను.

తెల్లారింది. పేపరువాడు వరండాలో పత్రిక వేసి పోయాడు. రాహులుడు గభాల్న నా ఒళ్ళో నుంచి కిందికి దూకాడు. ఇంట్లోకి వెళ్ళి నా కళ్ళజోడు తెచ్చాడు. అవి తన చెవులకు తగిలించుకొని పేపరు మీదికి వంగి "ఈ–ఊ–ఆ–" అంటూ చదవడం మొద లెట్టాడు. ముద్దుగా, మెత్తగా వీపు మీద చురక అం టించి, ఎత్తి మళ్ళీ ఒళ్ళో కూచోబెట్టుకున్నాను.

రాహులుడికి ఇంకా రెండేళ్ళు కూడా నిండలేదు. పొద్దున్నే వాళ్ళమ్మ పక్కలోంచి లేస్తూనే కళ్ళు నులుముకుంటూ నా దగ్గరకు వచ్చేస్తాడు. తరువాత వాడితోనే నాకు లోకం. నీరసమైన నా జీవితానికి సందడీ, స్పందనా వాడివల్లే. వాడి ఆప్యాయత ఒక్కటే నాకు దక్కింది. లోకంలో తాతలకు నిజమైన తోడు మనవలే. తాతలు తొందరగా దొర్లి గోతుల్లో పడకుండా ఏ కొంత కాలమైనా నిలదొక్కుకుంటున్నారంటే మన వలే కారణం. ఈ మలి సంధ్యలో మనవడు రాహు లుడు నాకో చిరువెలుగు.

వీథిలో కూరగాయలమ్మి పోతూ కనపడింది.

"మ్మో! మ్మో!" అంటూ రాహులుడు గేటు దగ్గరికి పరుగెత్తాడు. కూరగాయలమ్మి లక్ష్మి బుజ్జిగాడి బుగ్గ గిల్లి ఓ టమేటో పండు వాడి చేతిలో పెట్టి వెళ్ళింది.

లక్ష్మి ఒక చేత్తో చిన్న బిడ్డను చంకలో అదుము కొని, మరో చేత్తో బల్ల బండి తోసుకుంటూ కూరగా యలమ్మేందుకు రోజూ మా క్వార్టర్సుకు వస్తూ ఉంటుంది. మాకు బాగా తెలిసిన మనిషి ఆమె ఇల్లు కూడా క్వార్టర్సుకు దగ్గరలోనే ఉంది.

లక్ష్మి అపుడపుడూ వచ్చి ఇంటి జాగా పట్టాకు అర్జీ. బ్యాంకు లోనుకు దరఖాస్తు నాచేత రాయించుకొని పోతూంటుంది. ఇందాకా ఏ తహసీల్దారూ ఆమెకు పట్టాగానీ, ఏ బ్యాంకువారు ఋణం గానీ ఇచ్చినట్లు లేదు. కానీ ప్రతి ఏడూ అర్జీలు పంపుకొంటూనే ఉం టుంది. ఇంటి జాగాకు పట్టా పొందాలనీ, లోను తీసు కొని మరో ఎనుమును కొనాలనీ ఆమె చిరకాల వాంఛ.

లక్ష్మికి ఇద్దరు బిడ్డలు. మొగుడు ఎప్పుడో వదిలి పెట్టాడు. వాడు ఫారెస్టు డిపార్టుమెంటులో వాచరట. మామండూరులో ఒకామెను కట్టుకొని అక్కడే సెటిలై పోయాడు. భర్తకూ, తనకూ ఇప్పుడు ఎలాంటి సంబంధం లేదు.

జోడూ – తోడూ – దిక్కు లేని ఆడది. ఆమెకున్న ఆస్తి ఓ పూరిగుడిసె. ఒక పాలిచ్చే ఎనుము. రెండిళ్ళకు పాలు పోస్తుంది. కూరగాయలమ్ముతుంది. పిడకలు తడుతుంది. అడపా దడపా మా ఇళ్ళల్లో చెప్పిన పని చేసి పెడ్తూంటుంది. ముప్పయ్యేళ్ళ వయసులో ఉన్న లక్ష్మి ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకుంటూ ఉంటుంది.

అయిదారు నెలలకు ముందు లక్ష్మి తనకు తోడుగా ఒక మగవాణ్ణి చేరదీసింది. కానీ వాడిప్పుడు కనబడడం లేదు. బహుశా వదిలిపెట్టి పొయ్యాడేమో! ఆ మాటే మొన్న అడిగితే – కిలకిలా నవ్వి తల ఎగరేసి పోయింది.

## లౌక్యుడు

హితవు చెప్పువాడు హిరణ్యాక్షుడు
మంచి పల్కువాడు మతిలేనివాడు
ఎవడి దగ్గర వాడి తాళం వేయుచు
తప్పించుకు తిరుగువాడు లౌక్యుడు

## వేలం కొడుకు

కిలోమీటర్ ట్రాఫిక్‌జామ్
అమెరికా పెళ్ళికొడుకు
కళ్యాణమంటపానికి ఊరేగింపు
కోటి కట్నం
సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.

–పరుచూరి శ్రీనివాసరావు

## సమన్వయం

సుషుప్తిలో ఉన్నప్పుడు సైతం
యథాలాపంగా తట్టిలేపినా
చివుక్కున లేచి కూర్చొని
హృదయమనే కాన్వాసు మీద
ముగ్ధ మనోహరమైన చిత్రాన్ని రూపుదిద్దగలను.
నేర్పుగా / ఓర్పుగా
మధురమైన అనుభూతులు ఆలంబనంగా
నిశీధిలోని ఏకాంతం నన్ను అలరించినప్పుడు
చేతనాచేతనమైన ప్రకృతి / నా ముందు
లయబద్ధంగా నాట్యం చేస్తున్నప్పుడు
వాసంత సమీరాలను/హేమంత తుషారాలను
నా నేత్రద్వయం ముందుకు తెచ్చుకొని
ఎక్కడ లేని ఉత్సాహంతో/తెచ్చిపెట్టుకొన్న
నవయౌవన సుగంధ పరిమళాలు
నా నాసాగ్రాన్ని సోకుతున్నప్పుడు
అది పగలు గాని / రేయి గాని
గ్రీష్మతాపం గాని / శరత్పూర్ణిమ గాని
నా ఏకాంతంలో నేను
నా సమాధి అవస్థలో నాకు నేనే
రెచ్చిపోయిన ఉత్సాహంతో
విచ్చిపోయిన స్వప్నాల మధురిమలను
ఒక్కడనే / ఆస్వాదిస్తూ- అనుభవిస్తూ
ఈ విశాలమైన కాన్వాసు మీద
అందమైన చిత్తరువును రూపొందించగలను.
చిత్తరువును చిత్రించడంలో
క్రమబద్ధత / ఏకాగ్రత
తపన / నియమ నిష్ఠలు
నన్ను / ఎల్లవేళలా ఆవహించే నా నేస్తాలు
అందులకే / అది విశ్వజనీనం
కార్యసాఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనం
మనోవాంఛా ఫల సిద్ధికి తార్కాణం
ఈ అనుభవాన్ని
జీవితానికి సమన్వయించుకొన్నప్పుడు
జీవితం నాకు
సప్తవర్ణాల ఇంద్రధనుస్సు
ఉషః కాంతులను వెదజల్లే
విశ్వకవితా రోచిస్సు.

-డాక్టర్ ధూర్జటి వేంకట బాలాజి

మొగుడు లేడు. అమ్మా, నాన్న ఆధారం కూడా లేని అనాథ. ఇద్దరు చిన్నబిడ్డలు. ప్రాయంలో ఉంది. దిక్కులేని ఆడదైనా, లక్ష్మి ముఖంలో ఎన్నడూ చీకూ, చింతా కనబడదు. దిగులూ, దైన్యం చెంతకు చేర నివ్వదు. సరదాగా మాట్లాడుతూ, సంతోషంగా నవ్వుతూ, నిర్విచారంగా జీవితం గడుపుతూంది. లక్ష్మి జీవన విధానం, బతుక్కు ఓ సరళమైన భాష్యం చెపుతూ న్నట్లుగా తోస్తూంది.

ఀ ఀ ఀ

మధ్యాహ్నం మూడు గంటలప్పుడు మంచి నిద్రలో ఉన్నా.

రాహులుడు "తాతా!" అంటూ తట్టి లేపాడు. నా చెప్పులు తెచ్చి కాళ్ళ దగ్గర పెట్టాడు. నా వంకీ చేతి కందించాడు. "ఊఁ... పా...!" అంటూ పార్కు దిక్కుగా చెయ్యి చూపాడు.

మా క్వార్టర్సుకు చెందిన పిల్లల పార్కు కొన్ని గజాల దూరంలోనే వుంది. రోజుకు ఒకటీ రెండుసార్లయినా వాణ్ణి అక్కడికి తీసుకుపోతుంటాను. అక్కడ ఆడుకునేం దుకు వాడికి బలే సరదా. నా చెయ్యి పట్టుకొని లాక్కె ళ్ళాడు.

జగదాంబ మనమరాల్ని ఆడించుగుంటూ అక్కడ కనబడింది. పిల్లలిద్దరూ కలిసిపోయారు.

"రండి... మనం అక్కడ బెంచి మీద కూర్చుందాం" అంది జగదాంబ. ఇద్దరం సిమెంటు బెంచి మీద కూర్చున్నాం. పిల్లలు గడ్డినేల మీద దొర్లుతున్నారు తృప్తిగా.

పుష్యమాసం, పడమటి ఎండ నులి వెచ్చగా మా చెంపల మీద పడుతూ ఉంది.

"మీరు రోజూ కాఫీ పంపుతున్నారు. మీకు ఇబ్బంది కలిగిస్తున్నా. మీ ఉపకారానికి బాగా రుణపడుతున్నా" అన్నాను కృతజ్ఞత ధ్వనింపజేస్తూ.

"రాజుగారూ! ఈ దేశంలో ఆడవాళ్ళు సేవలు చేయడానికే పుట్టారు. తల్లిదండ్రులకు, భర్తలకు, అత్త మామలకు, బిడ్డలకు, మనవళ్ళకు... ఇలా క్రమంగా సేవలు చేస్తూనే జీవితం గడిపేయాలి. ఆడవాళ్ళకు అదో వృత్తి, ధర్మం అయింది. అలవాటుగా మారింది. అందులోనే వారు తృప్తి పొందుతుంటారు" స్త్రీలకు సంబంధించి అదో సామాన్య ధర్మంగా చెప్పింది ఆమె.

జగదాంబకు సుమారు అరవై ఏళ్ళుంటాయి. ఇంచుమించు నా సాటివయసు. అయినా యాభై ఏళ్ళ దిగా కనబడుతుంది. శుక్రవారం కాబట్టి శిరస్నానం

చేసింది. కొప్పు ముడిపెట్టి ఓ మందార పువ్వు గుచ్చింది. రాగి రంగులో పొడిపొడిగా వున్న వెంట్రుకలు మాపటెండలో మిలమిలా మెరుస్తున్నాయి.

నాలుగేళ్ళ ప్రసూన నిక్కీ నీలిగీ రాహుల్ని పైకి ఎత్తుకోడానికి పాటు పడుతూంది. బరువుకు ఇద్దరూ కిందపడుతున్నారు. నవ్వుకుంటున్నారు. గడ్డి మీద దొర్లుతున్నారు. జగదాంబ వారి చేష్టలు చూసి నిండుగా ఆనందిస్తూ ఉంది.

"-మరిచాను. మీవారెక్కడ? ఏం చేస్తుంటారు? ఎప్పుడూ ఇక్కడికి వచ్చినట్లు ఎరుగనే!" ఏదో ఒకటి మాట్లాడాలని ఆ విషయం అసంకల్పితంగా ప్రస్తావించాను.

"వారు నాకు శాశ్వతంగా దూరమైపోయారు" అంటూ పక్కున నవ్వింది ఆమె.

ఆమె చెప్పిన పద్ధతికి బిత్తరపోయాను. తరువాత గమనించాను. ఆమె నవ్వులో విషాదమేగాని, వినోదం కనబడలేదు. ఆమె కట్టూబొట్టూ చూస్తూ సందిగ్ధంలో పడ్డాను.

"మరి... మీరు..." నా నోరు తడబడింది.

"ముత్తయిదువునే!" రవంత సేపు ఆగి మళ్ళీ అన్నది.

"ఆయనేం కాలమై పోలేదు. పరదేశం పాలయ్యారు"

"అంటే?"

"నన్నొదిలి దేశం వదిలి శాశ్వతంగా దూరంగా వెళ్ళారు. ముప్పయ్యేళ్ళ నుంచి వైధవ్యాన్ని మోస్తున్నాను రాజుగారూ! శాస్త్రం ఒప్పుకోదు. కాబట్టి అయిదవతనాన్ని అట్టే పెట్టుకున్నాను" మళ్ళీ ఆమె మొగంలో అవే నవ్వు చారలు.

"అయితే గతంలో మీ..."

"మాస్టారూ, మరేమీ అడక్కండి! మా ఆడవాళ్ళకు గతాలూ లేవు. జ్ఞాపకాలూ లేవు. ఉండినా అప్పటికప్పుడు దులిపేసుకుంటాం. మాలో వాటికి చోటివ్వం. ఇచ్చినందువల్ల మనసుకు నష్టం. శరీరానికి కష్టం తప్ప మరేం లాభం లేదు. వాస్తవంలో గతాల్నీ, జ్ఞాపకాల్నీ మననం చేసుకొనే వసతీ, వెసులుబాటూ ఆడవాళ్ళకెక్కడివి?" అని చెప్పి మౌనంగా ఉండిపోయింది.

ఆ ప్రస్తావన ఆమెకు అయిష్టంగా ఉన్నట్లు తోచింది. నేను పొడిగించనూ లేదు. ఆమె చెప్పనూ లేదు.

పార్కులో పిల్లలిద్దరూ బండ మీద ఒకరి వెనుక ఒకరు జారుతున్నారు. జగదాంబ లేచి తిన్నగా వారి వద్దకు వెళ్ళింది.

అందాకా జగదాంబ సొంత విషయాలు నాకేం తెలియవు. తెలుసుకోవాలన్న ఆసక్తి కలిగింది. కొంత కూరగాయల లక్ష్మి నుంచి, మరికొంత మా ఇంట్లో వాళ్ళ నుంచి గ్రహించాను.

జగదాంబ తల్లిదండ్రులకు ఏకైక సంతానం. బాల్యంలోనే తల్లిని పోగొట్టుకుంది. తండ్రి గారాబంతో పెంచి తగుమాత్రం చదువు చెప్పించాడు. డాక్టరుగా ప్రాక్టీసు చేస్తున్న సాటి కులస్థుడైన యువకునికి డెబ్భై వేల రూపాయల కట్నంతో జగదాంబనిచ్చి పెళ్ళి చేశాడు. ఒక ఆడబిడ్డ కలిగింది. అల్లుడు పై చదువుగ్గాను మామ దగ్గర మరికొంత డబ్బు తీసుకొని అమెరికా వెళ్ళాడు. అంతే, మళ్ళీ తిరిగి రాలేదు. అక్కడే అమెరికా లేడీని మ్యారేజీ చేసుకొని ఆ దేశంలోనే స్థిరపడిపోయాడు. ఆయనగారు ఈ దేశానికి మళ్ళీ వచ్చింది లేదు. భార్యా బిడ్డను విచారించిన పాపాన పోయిందీ లేదు. ఉన్న ఆస్తి అంతా అమ్మి అల్లుడికి ధారపోసినాడు. కూతురు బతుకు దుఃఖభాజనమైంది. ఆ చింతతోనే తండ్రి కృశించి, క్షయరోగం తెచ్చుకొని

## కరుణించే కరకమలాలు

ఎందరెందరో సహృదయులు
గుప్తనిధుల్లా ఉంటారు
లోకం గొడ్డుపోలేదని
నిరూపిస్తారు
పసిగట్టే బుద్ధితో
జ్ఞానులకు చేయూతనిస్తారు
పసకనిపిస్తే చాలు
వెంటబడి సహకరిస్తారు
ఉన్నతికి ఉడుంపట్టుబడతారు

## ఎగిరిపోతున్న ఉత్పత్తి

చేలల్లో ఇళ్లు మొలుస్తున్నాయి
పంటలు సమాధి అవుతున్నాయి
అధిక జనాభా విస్తరణతో
భూములు కరువవుతున్నాయి
విశాల దృక్పథం కొరవడుతున్నది
స్వార్థ సుఖం పెట్రేగుతున్నది

**-జి. శ్రీశైలం**

లోకం చాలించాడు.

సుమారు పదహారేళ్ళ పిమ్మట అమెరికాలో ఉన్న భర్తగారికి ఇండియాలో ఉన్న భార్యా కూతురూ గుర్తు కొచ్చినారు. కూతురు పెళ్ళికిగాను ఒక లక్ష రూపా యలు ఈ దేశం వస్తున్న ఓ బంధువు ద్వారా పంపించి, చేతులు దులిపేసుకున్నాడు ఆయన. అప్పటికే ఎంతో లోకానుభవం, బతుకూ, బాధ్యతలూ ఎరిగి ఉన్న జగదాంబ ఆ డబ్బును మూర్ఖంగా తిరస్కరించలేక పోయింది. ఇరవై వేలు తన పేర బ్యాంకులో వేసుకొని మిగిలిన డబ్బుతో విశ్వనాథంతో కూతురు పెళ్ళి చేసింది. తానూ కూతురితో ఉండిపోయింది.

ఇపుడు జగదాంబకు అల్లుడూ, కూతురూ ఆస్పదం. కర్నూల్లో ఒక చిన్నాయన ఉన్నాడట. కానీ ఈ నష్ట జాతకురాల్ని తన ఇంటి ఛాయలకే రానివ్వడట.

## ప్రేమించడం నేర్చుకో..

కనులతో కనువిందు చేశావు
నవ్వులతో నాట్యమాడావు
మాటలతో మైమరపించావు
కవ్వించావు - నవ్వించావు
నేను పాట పాడితే పరవశించావు
మళ్ళీ మళ్ళీ పాడమని పరితపించావు
ప్రియా!
ఇన్నివిధాల మైమరపించి
నాలో ఆశలు రేపావు
చివరికి తిరస్కరించావు
మంచితనాన్ని వంచించావు
గెలిచానని విర్రవీగావు
నన్ను నన్నుగా చూడక
అందరిలో నవ్వులపాలయ్యావు
ఇప్పటికైనా ప్రేమించడం నేర్చుకో
నీ ఒంటరి జీవితాన్ని - చిగురింపజేసుకో
అందం శాశ్వతమని భ్రమపడకు
మంచిని పెంచుకో - మమతలు నింపుకో
అప్పుడే నేనెవరో తెలుస్తుంది.
జరిగిన దానికి
పశ్చాత్తాపపడుతున్నావని నాకు తెలుసు.

—ఉలాపు బాలకేశవులు

జగదాంబ దాచుకున్న విషాద వృత్తాంతం తెలుసుకొని విచలితుణ్ణయ్యాను. అడుగడుగునా పట్టాలు తిరగబడ్డ రైలుబండి లాంటి జీవితం ఆమెది. అన్నీ అపస్వరాలే! అన్నీ అపజయాలే! చీర కొంగులో మంచు నిప్పులు మూటగట్టుకున్న మగువ ఆమె. కొరివిని కదిపితే భగ్గుమంటుంది. అందుకే ఆ దినం ఆమె తన వివరాలు చెప్పడానికి వైముఖ్యం ప్రకటించింది.

❍ ❍ ❍

ఒక దినం సాయంత్రం తపోవనంలో గీతోపన్యాసాలు జరుగుతుంటే పొద్దుపోక అట్లా వెళ్ళాను. ఆరుగంటలకు సభ ముగిసింది. జనంతో కలిసి బయటికి వస్తున్నా. ఆడ గుంపులో వస్తున్న జగదాంబ నన్ను చూసి "అరే ఎప్పుడూ రానివారు ఈ దినం మీరూ వచ్చారే! చీకట్లో ఒంటరిగా ఇంటికి పోవాలే అనుకుంటూ ఉన్నా. మీరు కనపడ్డారు. ఇంటికే గదా పదండి, కలిసి పోదాం" అంది.

తపోవనం నుంచి క్వార్టర్సుకు రెండు కిలోమీటర్ల పైగానే ఉంటుంది. ఆటోలో ఆమెతో కలిసి కూర్చుని ఎట్లా పోవడమా– అని కొంచెం తటపటాయించాను.

"ఆటోలో ఎందుకండీ, మూడు రూపాయలు దండుగ! ఇటు చెరువు కట్ట మీదుగా దగ్గరి దారి. చిన్నగ నడుచుకుంటూ పోదాం!" అంది.

ఇంతలో గేటు దగ్గర నిలబడి జనాన్ని సాగనంపుతూ సభా నిర్వాహకుడు మమ్మల్ని చూసి - "సంతోషం అమ్మగార్ని కూడా పిలుచుకు వచ్చినారు. రేపు కర్మయోగం మీద స్వాములవారి ఉపన్యాసం బ్రహ్మాండంగా ఉంటుంది. ఇద్దరూ తప్పక రండి. మీలాంటి పెద్దలు వస్తే మా సభలకు నిండుదనం" అని పలికి థ్యాంక్స్ చెప్పి వెళ్లారు.

నా మనసు చివుక్కుమంది, నొచ్చుకున్నాను. జగదాంబ బాధపడి ఉంటుందేమో అనుకున్నాను.

"ఆc దానిదేముంది? తెలియనపుడు ఎవరైనా పొరబడుతారు. అంటారే తాటి కింద పాలు తాగిన చందాన. ఇదీ ఆ చందమే!" అని నవ్వుతూ "రండి మరి - చీకటి పడుతూంది" అంటూ ముందుకు సాగింది.

ఇద్దరం చెరువు కట్ట మీద నడుస్తున్నాం. చవితి వెన్నెల - చల్లగాలి - కెరటాల చప్పుడు - వాతావరణం ఆహ్లాదంగా ఉంది.

పదేళ్ళుగా గంగినేని చెరువుకు నీరు రాలేదు.

ఈ ఏడే వానలు పిచ్చిగా కురిశాయి. చెరువు నిండి తొణికిసలాడుతూంది. ఎందుకో తెలీదు. నాకు చిన్నప్పటి నుండి నీటి బెదురు జాస్తి. నిండుగా లోతుగా నల్లగా ఉన్న నీటి వైపు చూడ్డానికి జంకుతున్నా. పక్కలకు చూడకుండా బెదురు బెదురుగా నడుస్తున్నా.

"మీకు నీళ్ళంటే భయం లేదా?" అడిగాను.

"నీళ్ళంటే భయమెందుకండీ? అలలతో వెన్నెల్లో మిలమిలా మెరుస్తూన్న నిండు తటాకాన్ని చూస్తుంటే నాకెంతో ఆనందంగా ఉంది. ఒక వాస్తవం చెప్పనా? నాకేగాదు. మా ఆడజాతికే బావులు, చెరువులు, నదులు అంటే పడిచచ్చేంత ప్రేమ. ఆపదల్లో మమ్మాదుకునేది ఈ గంగాభవానే కదా?" అంటూ కొంచెం గంభీరంగా చెప్పింది జగదాంబ. వెంటనే గలగలా నవ్వుతూ "మీరేం జడుసుకోకండి. నేను తోడున్నాగా?" అని పలికి నాకు మరింత సమీపంగా వచ్చి నడక సాగించింది.

నేను కించపడలేదు. చేదు మాటనైనా తియ్యగా చెప్పే నేర్పు జగదాంబది.

అలల చప్పుడు, కప్పల దూకుడు శబ్దం, నీటిపైన ఎగురుతున్న పిట్టల రెక్కల సవ్వడి వింటూ నడుస్తున్నాం.

కట్ట మీద మాకు లక్ష్మి ఎదురొచ్చింది.

"ఎక్కడికి లక్ష్మీ. చీకట్లో బయలుదేరావు?"

"యాడికీ లేదమ్మా. మిమ్మల్నే వెతుక్కుంటూ వస్తుండా. పొద్దుటినుండీ ఒకే తలనొప్పిగా ఉంటే అమృతాంజనం అడుగుదామని మనింటికి పోయుంటిని. అప్పుడు అక్క చెప్పింది అమ్మ సభలకు వెళ్ళింది. ఇంకా రాలేదు. చీకట్లో చెరువు కట్ట మీద ఒకతే వస్తూంటుందేమో. కొంచెం వెళ్ళి చూడు లక్ష్మీ' అంది. అందుకే యెదురు వస్తూంట. ఇంకేం బయ్యం? అయ్య తోడుండాడు" అని చెప్పి మాతోపాటే నడుస్తూ మళ్ళీ లక్ష్మి "యెనుము తప్పించుకొని పోయిందమ్మా! సందకాడ పాలు పిండి తలుగు వదిలిపెట్టా. ఇంకా ఇంటికి రాలేదు. యెతికి యెతికి కాళ్ళు నొప్పులెత్తాయి. కణతలు పీకుతుండాయి. దొంగగొడ్డు యాడికి చచ్చిందో! మబ్బు కాలం బిడ్డల్ని వదిలిపెట్టి వచ్చా. ఇంటి తలుపు కూడా వెయ్యలేదు. ఒంటిదాన్ని యాడికని చావను?" అని వదురుతూ వస్తూంది లక్ష్మి.

"ఔను లక్ష్మి! ఇందాకా ఒక మగాయన్ను తోడు తెచ్చుకొని ఉంటివే! ఆయన లేడా?" అడిగింది జగదాంబ.

"కూడు దొరక్క చస్తుంటే ముండ కొడుకును దగ్గరికి చేరదీశా. దేవర పొట్టేల్ని మేపినట్లు రెండు నెల్లు మస్తుగా తిండిపెట్టాను. బాగా కొవ్వు పట్టినాడు. దీని జతకు ఇంకో యెనుమును కొందామని పాలమ్మి కూడబెట్టిన దుడ్డు దొంగనాకొడుకు దొబ్బేసి పారిపొయ్యాడు. నా సొత్తు తిన్నోడు పైకి రాడులే. ఆ బాంకోళ్ళు లోనన్నా ఇచ్చి సస్తే ఇంకో యెనుమును పట్టుకోవచ్చు..." అంటూ లక్ష్మి వగచింది.

"అలాంటి పోరంబోకులకు ఇకమీదట ఇంట్లో చోటివ్వకు. దిక్కులేని దానివి. రెక్కల కష్టంతో బతుకుతున్నావు. దోచేసి నిన్ను బికార్ని చేసి పోతారు" జగదాంబ సలహా ఇచ్చింది.

లక్ష్మి రెండడుగులు మౌనంగా నడిచి పిమ్మట తల ఓరగా పెట్టి ఆమెను చూస్తూ- "నాకేం గాచారం పెద్దమ్మా, పాణం ఉగ్గబెట్టి బతకాలని? నేనుండా. నా కష్టముండాది. ఉప్పూ, కారం తింటున్న మనిషినైతి. తోడూ జోడూ లేకుండా యెంత కాలమని బతికేది?"

ఊహించని జవాబు! జగదాంబ అవాక్కయింది. మరేం మాట్లాడలేదు. ఇళ్ళ దగ్గరికొచ్చేశాం.

○ ○ ○

ఉదయం ఎనిమిది గంటలైనా చలి తగ్గలేదు. పార్కుకు వెళ్ళి నీరెండలో బెంచి మీద కూచున్నాను. మనిషి అవసాన కాలాన్ని గురించి మనసులో ఆలోచన మొదలైంది.

## ఎవర్ గ్రీన్!

మన రాజకీయ నాయకులు
ఎవర్ గ్రీన్
పదవులు పట్టుకుని
వేళ్ళాడుతూనే వుంటారు
మన సినీ హీరోలు
ఎవర్ గ్రీన్
వెండి తెరని
అంటిపెట్టుకునే వుంటారు
మన క్రికెట్ వీరులు
ఎవర్ గ్రీన్
రికార్డులని ఆశ్రయించుకుని
రిటైర్‌మెంట్ లేదనుకుంటారు

-తాజీప్రసాద్

ఈలోగా మా దగ్గరి బంధువును చూసేందుకు మా పల్లెకు వెళ్ళాను. ఆయనకు డెబ్బై ఏళ్ళు. చివరి రోజుల్లో మంచాన పడి నరకమే అనుభవించాడు. ఒంటికి- రెంటికి - తినడం - తాగడం - అన్నీ మంచం మీదే. ఇద్దరు మనుషులు లేపాలి. కూచోబెట్టాలి. పడుకోబెట్టాలి. అట్లా రెండేళ్ళఘోరించి తనువు చాలించాడు. ముసలామె కంటికి రెప్పలా చూసుకొని సేవలు చేసింది. అప్పటికి పల్లెలో ఉండబట్టీ, భార్య సేవలు చేయబట్టీ ఆయన అదృష్టవంతుడే అనుకోవాలి.

ముదిమి ఎప్పుడు ఏ ముప్పు తెస్తుందో! ఒకవేళ నాకే గనుక అలాంటి దుస్థితి దాపురిస్తే నా గతేం కాను? అందునా ఈ పట్నవాసం బతుకుల్లో - ఆలోచిస్తున్నా.

ఇంతలో మనమరాల్ని వెంటబెట్టుకొని జగదాంబ అక్కడికి వచ్చింది.

"రాజుగారు ఒంటరిగా కూచోని ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారే!" అంటూ ఆమె నాకు కొంచెం ఎడంగా బెంచి మీద కూర్చుంది.

"పేదవానికి పెళ్ళామే పెన్నిధి" అన్నది ఒక సూక్తి. కానీ ముసలితనంలో మగవానికి భార్య తోడు మరీ అవసరం. అదే ఆలోచిస్తూ కూర్చున్నా" అన్నాను ఆమెతో.

"మగవారు కదా! మీకు తగినట్లే ఆలోచిస్తారు" అని చెపుతూ ఆమె ఒళ్ళో ఉన్న మనుమరాల్ని కిందికి దింపుతూ - "ఈ సూక్తులూ, సూత్రాలూ మగవాళ్ళు తమ అవసరాల్ని దృష్టిలో పెట్టుకొని చెప్పుకొన్నవి. కానీ ఆడవాళ్ళ అవసరాల్ని గురించి యే సూక్తి చెప్పినట్లు లేదే!"

"అబ్బే! ఇక్కడ నా అభిప్రాయం ఆలుమగల అనుబంధం గురించే" సర్ది చెప్పాను.

"మాస్టారూ! ఆలూ లేదు, అనుబంధమూ లేదు. అంతా పురుషుని స్వార్థం. పేదరికంలోనేమి, యౌవనంలోనేమి, వృద్ధాప్యంలోనేమి - మగవాడి ఉపయోగానికి ఎప్పుడూ ఒక ఆడది ఉండాలి. చివరకు చచ్చేటప్పుడు కూడా ఆడదాని తొడమీద తల పెట్టుకుని హాయిగా చావాలనుకుంటాడు మగాడు" అంది. ఆపైన నన్ను చూసి మెత్తగా నవ్వుతూ- "మాట వరసకు మిమ్మల్నే తీసుకుంటాను. మీకు ఏ విధంగా బాధ కలిగినా మీ భార్య పార్వతమ్మ జ్ఞాపకానికి వస్తూం టుందని మీరు అంటుంటారు కదా. ఒకవేళ మీ భార్యకు బదులు మరో ఆడది గనక మీకు తోడ్పడితే మీకు ఉపచారాలు చేస్తుంటే అప్పుడూ పార్వతమ్మ మీకు జ్ఞాపకానికి వస్తుందా? రానే రాదు. మీ స్మృతిపథం నుంచి ఆమె మరుగైపోవడం ముమ్మాటికీ నిజం. మగవారి మనస్తత్వమే అలాంటిది-..."

"ముసలితనం మగవారికీ వస్తుంది ఆడవారికీ వస్తుంది. మగవాడు తన అవసరాల్ని గురించి అంగలారుస్తాడు. ఆర్భాటం చేస్తాడు. కానీ ఆడదానికి - మన కుటుంబాల్లో ఆ అవకాశం ఉందా? స్వేచ్ఛ ఉందా? మీరు గనక ఆలోచిస్తే ఈ వాస్తవాల్ని కాదనలేదు."

ఆమె నన్ను ఉదహరించినందుకు కించపడలేదు.

### కాలం జారిపోయిన క్షణం..!

సుదూర తీరాల నుంచి
పయనం చేసి వచ్చే
పక్షిలాగ... / కాలం ఆగి-
కొంత సేద దీరాలనుకుంది!
కానీ-
కరంటు కోతలతో
కకావికలమయినట్లుగా
కష్టాలను కౌగలించుకొని
కొందరు-
గృహహింసల బారిన పడి
కుమిలిపోయే మహిళల్లా
బాధల సంకెళ్ళలో చిక్కుకొని
మరికొందరు-
నష్టాల ఊబిలో
వియోగంలో
ఎందరెందరో-
మరోవైపు!
సుఖ సంతోషాలు
భోగభాగ్యాలలో
అన్యోన్య దాంపత్యంలో
ప్రేమ పరవళ్ళలో
కొందరు-
ఎలా-?
ఒక ప్రశ్నగా
సంఘర్షణగా / సందిగ్ధంలో...
కాలం చడీ చప్పుడు లేక
చల్లగా జారుకున్న వైనం!

-గుర్రాల రమణయ్య

ఆమె పేర్కొన్న యదార్థాల్ని కాదననూ లేదు. ఇద్దరం జీవితం చివరి మజిలీలో పయనిస్తున్న బాటసారులం కాబట్టి- మా వయసులు, సమస్యలు, ఆలోచనలు, బాధలు ఒకేరకమైనవి. ఒకే గాడికి చెందినవి. మా అభిప్రాయాలు, అనుభవాలు సమానంగానూ, సానుభూతి పూర్వకంగానూ ఉండేవి.

నేను మనుమణ్ణీ, ఆమె మనుమరాల్ని వెంట బెట్టుకొని రోజూ పార్కులో కలిసేవాళ్ళం. మనసు విప్పి మాట్లాడుకునేవాళ్ళం.

ఎన్నో వారాలు గడిచాయి.

చదువు, సంస్కారం, చక్కని మాటతీరు ఉన్న జగదాంబతో సంభాషణ, సాహచర్యం నాలో జీవితం పట్ల సరికొత్త ఆలోచన, అవగాహన కలిగించింది.

○ ○ ○

ఉన్నట్లుండి జగదాంబ రెండు రోజులుగా కనిపించలేదు. కర్నూలు వెళ్ళినట్లు తెలిసింది. మాటమాత్రమైనా చెప్పింది కాదే - అనుకున్నా. ఆమె లేని రెండు రోజులూ శూన్యంలో పడ్డట్టనిపించింది.

మూడోదినం తెల్లవారుజామున నేను మేలుకొనేటప్పటికి పక్కింట్లో ఒక్కపెట్టున అరుపులు, ఏడ్పులు వినపడ్డాయి. అప్పటికే ఇరుగు పొరుగు వారు విశ్వనాథం ఇంటి దగ్గర చేరారు. విశ్వనాథం భార్య దుర్గాంబ వెక్కివెక్కి ఏడుస్తూ బిడ్డనెత్తుకొని ఆదరాబాదరా మా ఇంటికి వచ్చింది.

"మా అమ్మగారు చనిపోయారంట. గురువారం పొద్దున్నే సాయిబాబా గుడికి వెళ్ళిందంట. అక్కడ తుంగభద్రలో స్నానం చేస్తూ, ప్రమాదవశాత్తు ప్రవాహంలో పడి ప్రాణాలు పోగొట్టుకుందట. శవం ఇంటికి చేర్చాం. వెంటనే రావలసిందంటూ మా చిన తాతగారు టెలిగ్రాం ఇచ్చినారు. ఇప్పుడే కర్నూలు బస్సుకు వెళుతున్నాం" ఎక్కిళ్ళ మధ్య ఏడుస్తూ చెప్పి వెళ్ళింది.

జగదాంబ చచ్చిపోయిందా? నిజంగా చచ్చిపోయిందా?

నాకు షాక్ తిన్నట్లయింది. శరీరం కంపించింది. మెదడు గడ్డ కట్టినట్లనిపించింది. దుఃఖం ఉవ్వెత్తున ఉబికింది. మగవాడయిన దోషం నలుగురికీ నా ఏడుపు కనిపిస్తుందని మొగం చాటుచేసుకొని బిరబిరా పార్కు దిక్కుగా దూసుకెళ్ళాను. అక్కడ కూచున్నానో, నిల బడ్డానో, కాలు నిలవక తిరిగానో నాకే తెలీదు. అరగంట తరువాత తిరిగి ఇంటికొచ్చాను.

పక్కింటికి తాళం ఉంది. మా ఇంటి ముందు వరండాలో గుంపుగా ఆడవాళ్లు దిగులు మొగాలతో నిలబడి ఉన్నారు.

"సోమవారం జగదాంబమ్మగారి వియ్యంకురాలు వచ్చిందమ్మా. ఆ రోజంతా వారింట్లో ఒకే గొడవగా ఉండింది- మహాతల్లి మా ఇంటికొచ్చి తిష్ట వేసింది. అమ్మా, కూతురూ ఏకమై మా వాడికి మత్తుమందు పెట్టారు. మాకు కాకుండా చేశారు. నా కొడుకు తాళి కట్టింది నీ కూతురికి గానీ నీకు గాదే!" అని వియ్యంకురాలు పెద్దమ్మగార్ని దుయ్యబడుతుండగా విన్నానమ్మా. ఆ నిందలూ, నిష్ఠూరాలూ ఆమె సయించలేకపోయారు. పొద్దున్నే లేచి బస్సుకెళ్ళిపోయారు. ఆమె కర్నూలు పోయింది చుట్టాల్ని చూసేందుకు కాదు. ప్రాణాలు పోగొట్టుకునేందుకే!" లక్ష్మి కన్నీళ్ళు తుడుచుకుంటూ అమ్మలక్కలకు చెబుతూంది.

నేను విన్నాను. గుంపును తప్పించుకుని నేరుగా ఇంట్లోకి వెళ్ళి సోఫాలో కూలబడ్డాను.

రాహులుడు నన్ను చూసి లోనికి వచ్చాడు. "తాతా! అవ్వ పాయ్!" అంటూ చెయ్యి తిరగేసి చెప్పి వెళ్ళాడు. అది సంతాప వార్త అని వాడూ తెలుసుకున్నాడు.

○ ○ ○

మరుదినం పోస్టులో నా పేర ఒక రిజిష్టరు కవరు వచ్చింది. విప్పి చూశాను. దానిలో ఒక డి.డి., ఒక ఉత్తరం ఉన్నాయి. చదివాను-

"రాజుగారికి నమస్కారాలు,

ఇందువెంట రెండువేల రూపాయలకు ఒక డిమేండు డ్రాఫ్టు తీసి పంపుతున్నాను. బ్యాంకులో డబ్బు తీసి కూరగాయల లక్ష్మికి ఇచ్చేది. ఈ డబ్బుతో ఆమెను ఓ పాడి ఎనుమును కొనుక్కోమని చెప్పండి. లక్ష్మి ఒకరి సహాయం, సానుభూతి ఆశించేది కాదు. అయినా నా మక్కువ కొద్దీ పంపుతున్నాను. నా తృప్తికి తీసుకొమ్మని చెప్పండి ఆమెకు. ఆమె బిడ్డలకు నా ఆశీస్సులు తెల్పేది.

మొండిగానైనా బండగానైనా బ్రతుకు సాగించాలని ప్రయత్నించాను. నంఘం నహించలేదు. అడుగడుగునా అవరోధాలే. సెలవు తీసుకుంటున్నాను.

కర్నూలు ఇట్లు
10-2-89 *మీకు తెలిసిన జగదాంబ."*

ఆలోచనలు దూరాలకు దూసుకుపోతుండగా అట్లాగే నిలబడిపోయాను.

గుండెకు కరిగే లక్షణం లేదు. ఉంటే ఆ క్షణం కరిగి నీరయ్యుండేది. ■